

# ఎలిజీలు

## – గొల్లపూడి మారుతీరావు



*కౌముది ప్రారంభసంచిక నుంచి క్రమం తప్పకుండా కనిపిస్తున్న పేరు ఆత్మీయ మిత్రులు గొల్లపూడి మారుతిరావు గారు. ఆయన వ్రాసిన ఎన్నో నవలలు, కథలు , వ్యాసాలు, కాలమ్స్ కౌముదిలో వచ్చాయి. ఆనవాయితీ తప్పకుండా వారు వ్రాసిన ఎలిజీలు వ్యాసాలను నెలకొకటి చొప్పున పునర్ముద్రిస్తున్నాము. గొల్లపూడి మారుతిరావుగారు భౌతికంగా మన మధ్యన లేకపోయినా ఆయన ఆశీస్సులు కౌముదిని సదా వెన్నంటే ఉంటాయి.*

*(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)*

### ఇల్లాలి (భర్త) ముచ్చట్లు



పురాణం సుబ్రహ్మణ్య శర్మగారు కన్నుమూశారని చదివి నేనూ మా ఆవిడా గతుక్కుమన్నాం. నాకు ఆయన దాదాపు 40 ఏళ్ళ మిత్రుడు. మా ఆవిడ తరపు బంధువు. ఇంకా చెప్పాలంటే శర్మగారి తల్లీ, మా అత్తగారూ చిన్నప్పటి స్నేహితురాళ్ళు. నా జీవితపు ప్రతి మలుపులోను నాతో నిలిచిన హితుడు. మా ఆవిడకి కార్తీక మాసాల్లో సోమవారం బ్రాహ్మడు. (లబ్బీపేటలో పురాణం, రాచకొండ నరసింహ మూర్తిగారు భోక్తలు)

జీవితంలో చాలా దశల్లో మనతో నిలిచే మిత్రులు అరుదుగా ఉంటారు. నేను ఢిల్లీలో ఉన్న రోజుల్లో ఎక్కువగా శర్మగారూ నేనూ మోతే వేదకుమారిగారి నార్త్ ఎవెన్యూ ఫ్లాట్‌లో గడిపేవాళ్ళం. ఆయనకి రైల్వేలో పని. చాలా సాయంకాలాలు కానాట్ సర్కస్ మొగిలో ఇండియా కాఫీ హౌస్ దగ్గర నిలబడితే – రెండు చేతుల్లో మొక్కజొన్న పొత్తులు పట్టుకుని సాహిత్య అకాడమీ ఆఫీసు మీదుగా రైల్వే ఉద్యోగం ముగించుకుని వచ్చేవారు శర్మగారు. ఇద్దరం పార్లమెంటు స్ట్రీట్ అంతా నడిచేవాళ్ళం. కృషిభవన్ పక్క లాన్‌లో నాటకం రిహార్సల్స్.

నా ఆంధ్రప్రభ ఉద్యోగానికి ఆయనే అప్లికేషన్ సిద్ధం చేసి సైకిలు మీద వెళ్ళి పోస్టు చేశారు. నార్త్ ఎవెన్యూ ఫ్లాట్‌లోనే పూర్తికాని నా "చీకటిలో చీలికలు" నవలా పఠనం ఏర్పాటు చేశారు. కపిల కాశీపతి, పన్యాల, ఏల్చూరు సుబ్రహ్మణ్యం, కొత్తపల్లి, సెట్టి ఈశ్వరరావు – అందరి పరిచయం అప్పుడే నేను విజయవాడ వస్తే పురాణం వారింట్లోనే మకాం. తమ్ముడు పురాణం సూర్యప్రకాశరావు నన్ను స్వయంగా ఆంధ్రప్రభ ఆఫీసుకు తీసుకువెళ్ళాడు.

నేను రేడియోలో చేరేనాటికి శర్మగారు రైల్వే ఉద్యోగం మానేసి ఆంధ్రజ్యోతికి వచ్చారు. ఆయన్ని రచయితగా తెలుసుకుని, ఈయనేమిటి పత్రికా సంపాదకత్వమేమిటి? అనుకునేవాడిని. కానీ పత్రికా నిర్వహణలో ఒక గుబాళింపునీ, ఒక రుచినీ తెచ్చిన అతి తక్కువమంది సంపాదకులలో పురాణం ఒకరు. నా చేత ఎన్ని రచనలు వ్రాయించారో, నాకు యాక్సిడెంట్ అయితే ఆసుపత్రి పాటలు వేశారు. 'ఇడియట్' నవలకి తను శ్రీకారం చుట్టి, నాచేత, కొమ్మూరి చేత వ్రాయించారు. 'వ్రాయించారు' అని ఎందుకంటున్నానంటే - శర్మగారు పూనుకోకపోతే ఆ రోజుల్లో ఆ రచనలు చేసేవాడిని కాను.

దీపావళికి కథ వ్రాయమని 'కాకీ చొక్కాలో కాఫీ చుక్క' అని బొరసాల వేశారు. అది మంచి కథ. దాదాపు పదిహేను సంవత్సరాల కిందట పురాణంగారు, నండూరిగారూ పూనుకోకపోతే 'జీవనకాలమ్' ఉండేది కాదు. ఆయనకి నాచేత వారపత్రికలలో ఒక కాలమ్ రాయించాలని కోరిక ఉండేది. నా బాదరబందీలో వ్రాయగలనా అని నా భయం. 'వ్రాసినప్పుడే వేస్తాను' అని ధీమా ఇచ్చారు. ఎందువల్లనో ఎంతకీ మొదలుపెట్టలేకపోయాను. మిత్రులిద్దరూ కలిసి ఉత్తరాలు వ్రాసి నా చేత ప్రారంభింపచేశారు. వారి సంకల్పబలం ఎంత గొప్పదో ఒకటిన్నర దశాబ్దాలుగా సాగుతోంది ఈ కాలమ్.

వారపత్రికలో చాలా వాటిల్లో కొత్త ఒరవడిని తీసుకువచ్చారు పురాణం. ఇప్పుడు వస్తున్న 'కాలక్షేపం' పత్రికల్లాగా కాక చదువు ప్రయోజనాన్ని పెంచే పత్రిక పురాణం సంపాదకీయంలో వచ్చిన వారపత్రిక.

ఆయన 'ఇల్లాలి ముచ్చట్లు' ఓ బడి. వాక్యం రాయడం ఇంత సులువా అన్నంత అలవోకగా ఉంటుంది ఆయన తెలుగు. పది వాక్యాలలో ఆయన వాక్యం కొట్టొచ్చినట్టు తెలుస్తుంది.

'అభ్యుదయం' వేపు ఆయన వేలు ఉండేది. కానీ మంచి భోజనం చేసి, కిళ్ళీ వేసుకుంటే ఆయనకి ఆ రోజుకి విజయాన్ని సాధించినట్టే. రావిశాస్త్రి ఆయన అబ్సెషన్. శ్రీశ్రీ ఆయన వీక్‌నెస్. మధ్య తరగతి జీవితం ఆయనకి లయెబిలిటీ. "ఇడియట్ నవల రెండో ముద్రణ రాయల్టీ ఆయనకి కావాలిట. మనిద్దరం సరేనంటే ఆయన తీసుకుంటారు" అన్నారు కొమ్మూరి ఓసారి నాతో. ఆనందంగా సరేనన్నాను.

ఆయన షష్టిపూర్తికి వాళ్ళబ్బాయి ఉత్తరం రాశాడనుకుంటాను. శర్మగారి గురించి వ్రాయడానికి ఈ కాలమ్ కురచ. ఆయన చాలా ఎత్తయిన పొట్టివాడు. నా పక్కన నిలబడితే ఎప్పుడూ నాకంటే ఎత్తుగా ఉండి నా భుజం తట్టేవాడు. నాకు తెలిసి శర్మగారు ఒకే ఒక్క సినిమాకు రాశారు. ఆ సినిమాకి నేను ఘోస్టుని.

ఈ తరంలో సాహిత్యాన్ని సుసంపన్నం చేయడంలో, ఈ సాహితీవనంలోకి కొత్త రచయితల్ని చెయి పట్టుకు నడిపించుకు వచ్చిన ఘనత పురాణంది. తనకోసం పత్రికని వాడుకునే ప్రబుద్ధులున్న ఈ రోజుల్లో పత్రిక కోసం తనని వాడుకున్న అతికొద్దిమంది సంపాదకుల్లో పురాణం ఒకరు.

ఈమధ్య చాట్ల శ్రీరాములు, ఎన్.ఆర్.నంది నాటకంలో నా చేత వేషం వేయించి "నువ్వు పురాణంలా నటించాలి" అన్నాడు. వేషం అయితే వేసుకున్నాను. కానీ అనుసరించడానికయితే పురాణం లొంగుతాడుకానీ అనుకరించడానికి లొంగడు. తెలుగు సాహిత్యంలో ఒక్కడే "పురాణం".

*(వచ్చే నెలలో మరో ఎలిజీ)*

Post your comments